సాక్షి సంగారెడ్డి

గురువారం । 2 । మార్చి । 2023



చికెన్‌ముక్క గొంతులో ఇరుక్కొని..
చికెన్ ముక్క గొంతులో ఇరుక్కొని ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం కొప్పులపల్లిలో చోటుచేసుకుంది. 8లో



అపరిచిత కాల్స్‌కు స్పందించొద్దు
సైబర్ మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత నంబర్ల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్‌కు స్పందించొద్దని సిద్దిపేట వన్ టౌన్ సీఐ భిక్షపతి సూచించారు. 8లో



అంగన్‌వాడీల నిరసన
కనీస వేతనాలు అమలు చేయాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు సీడీపీఓ కార్యాలయాల వద్ద నిరసన తెలిపారు. 9లో

న్యూస్‌రీల్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జహీరాబాద్ టౌన్: 33 కేవీ లైన్ల మరమ్మతుల కారణంగా గురువారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని మన్నాపూర్ ట్రాన్స్‌కో ఏఈ సతీశ్ తెలిపారు. 33 కేవీ కొత్త లైన్ల పనులు చేపడుతున్నందున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సత్వార్, చిరాక్‌పల్లి, మాడ్గి, బూచినెల్లి, బుర్దిపాడ్, తుంకుంట గ్రామాల్లో కరెంట్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

అమీన్‌పూర్ బడ్జెట్‌కు ఆమోదం

పటాన్‌చెరు: అమీన్‌పూర్ మున్సిపాలిటీ రాబడి, వ్యయాల అంచనా బడ్జెట్‌కు ఆమోదం లభించింది. బుధవారం మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్మన్ టి.పాండురంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తీర్మానించిన రూ.45 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు. పన్ను రాబడి రూ.1,800.69 లక్షలు, పన్నేతర రాబడి రూ.2,649 లక్షలు, ప్రారంభ నిల్వ రూ.63.08 లక్షలు, మొత్తం కలిపి రూ.45,07,78,000 తో అంచనా బడ్జెట్‌ను రూపొందించినట్లు కమిషనర్ సుజాత తెలిపా రు. ఆదాయం, వ్యయాలు పోను మిగులు రూ.112.54 లక్షలతో బడ్జెట్‌ను రూపొందించామన్నారు. ఈ సమావేశానికి వైస్ చైర్మన్ నందారం, నర్సింహాగౌడ్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు కొందరు గైర్హాజరయ్యారు. చైర్మన్ అనుకూల బీఆర్ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ, ఇతర కౌన్సిలర్ల మద్దతుతో సమావేశం నిర్వహించారు.

రైళ్ల రద్దుతో ప్రయాణికుల ఇబ్బందులు



అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో డీసీసీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, కార్యకర్తలు

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట రైల్వేస్టేషన్‌ను బుధవారం డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరిశీలించారు. కార్యకర్తలతో కలిసి స్టేషన్‌లో కలియతిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మెదక్, కాచిగూడ రైళ్ల రద్దుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారని అన్నారు. స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేశ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్యాంరెడ్డి, లక్ష్మాపూర్ ఎంపీటీసీ నాగులు, యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రామాయంపేట పట్టణశాఖ అధ్యక్షుడు చింతల యాదగిరి, తదితరులు ఉన్నారు.

ఫాస్టాగ్ స్లో!

ఆధునీకరించినా.. ఫాస్టాగ్ తెచ్చినా టోల్‌గేట్ల వద్ద సమస్యలు తీరడం లేదు. అవగాహన లేమి, బ్యాలెన్స్ లేకపోవడంతో వచ్చే ఫాస్టాగ్ సమస్యలతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. జిల్లాలోని ఆయా టోల్‌గేట్ల పరిధిలోకి వచ్చే స్థానికుల నుంచి సైతం టోల్ వసూలు చేస్తున్నారని పలువులు వాహనదారులు ఆరోపిస్తున్నారు. టోల్ ప్లాజాల్లో స్థానికేతరులు సిబ్బంది ఉండటం.. వసతులు కల్పించకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి.



హైదరాబాద్ - మెదక్ జాతీయ రహదారిపై గుమ్మడిదల టోల్‌గేట్

- అవగాహన లేక.. బ్యాలెన్స్ లేక పలు చోట్ల ఇబ్బందులు
- స్థానికేతరులతో టోల్‌ప్లాజాల నిర్వహణ.. స్థానికుల నుంచి టోల్ వసూలు

సాక్షి పరిశీలన



తాడ్దాన్‌పల్లి టోల్‌ప్లాజా వద్ద వాహనాలు

జోగిపేట(అందోల్): సంగారెడ్డి జిల్లాలోని 161 జాతీయ రహదారి తాడ్దాన్‌పల్లి చౌరస్తా వద్ద ఉన్న టోల్ గేట్‌ను ఫిబ్రవరి 2వ తేదీన ప్రారంభించారు. దీనికి 15 ఏళ్ల పాటు కాలపరిమితి ఉంది. రోజూ ఆరు వేల నుంచి ఏడు వేల వరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ టోల్ గేట్ గుండా జోగిపేట, సంగారెడ్డి, మెదక్, నారాయణఖేడ్, నిజాంసాగర్ వైపు వాహనాలు వెళ్తుంటాయి. టోల్‌ప్లాజాలో లేటెస్ట్ వెర్షన్ కంప్యూటర్లు ఉన్నాయి. ఇక్కడ ఒక్కోసారి ఫాస్టట్యాగ్ స్కానింగ్ ఆలస్యం కావడంతో వాహనాలన్నీ బారులు తీరుతున్నాయి. దానికి కారణం వాహనం నంబర్ బ్లాక్‌లిస్ట్‌లో పడటం, ఫాస్టాగ్ రీడ్ కాకపోవడం, బ్యాలెన్స్ అయిపోవడమే అని టోల్ మేనేజర్ జగదీశ్ తెలిపారు. చాలా వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వాహనాలు నిలవకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. నెలకు రూ.315తో లోకల్ పాస్ ఇస్తున్నాం. లోకల్ వాహనాలు వచ్చిన సమయంలోనే ఆలస్యం జరుగుతుందని చెప్పారు.

అవగాహన లేక అవస్థలు



చాలా వరకు ఫాస్టాగ్‌లో బ్యాలెన్స్ లేకపోవడం, బ్లాక్ కావడం వల్ల స్కానింగ్ కాకపోవడంతో టోల్ ప్లాజా వద్ద వేచి ఉండాల్సి వస్తుంది. దీంతో ఒక్క నిమిషంలోనే పదికి పైగా వాహనాలు బారులు తీరుతున్నాయి. తాడ్దాన్‌పల్లి వద్ద టోల్ గేట్ కొత్తగా రావడం.. ఈ ప్రాంత వాహనదారులకు అవగాహన లేకపోవడంతో కొన్ని సమస్యలు తలెత్తుతున్నాయి.

– రాంరెడ్డి, వాహనదారుడు, జోగిపేట

కంకోల్ టోల్‌గేట్‌లో నాన్‌లోకల్స్!

మునిపల్లి(అందోల్): 65వ నంబర్ జాతీయ రహదారిపై ప్రయాణించాలంటే డబ్బులు తప్పని సరని కంకోల్ టోల్‌గేట్ రుజువు చేస్తుంది. బుధవారం సాక్షి విజిట్‌లో తెటతెల్లమయింది. టోల్‌గేట్‌లో వివిధ రకాల వాహనాలకు ఫాస్టాగ్ స్టిక్కర్ తప్పని సరిగా ఉండాలి. ఫాస్టాగ్ స్టిక్కర్ లేకపోతే టోల్‌గేట్ దాటడానికి సంబంధించి ఫోన్‌లో డబ్బులుండాలి. ఫాస్టాగ్ స్టిక్కర్ లేకపోవడం, టోల్‌గేట్‌కు సంబంధించి ఫోన్‌లో డబ్బులు లేకపోతే వాహనాలు టోల్ గేట్ నుంచి పోవడానికి అనుమతి లేదు. దీంతో కంకోల్ టోల్‌గేట్ వద్ద పలు వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోతున్నాయి. టోల్‌గేట్ నుంచి వాహనాలు వెళ్తున్న సమయంలో స్కానింగ్ ఆటోమేటిక్‌గా తీసుకుంటుంది. ఎల్ఎన్‌టీ సంస్థ టోల్‌గేట్‌లో అత్యాధునిక కంప్యూటర్లను ఏర్పాటు చేసింది. టోల్ గేట్‌లో స్థానికులను కాకుండా ఇతర రాష్ట్రాల సిబ్బందిని నియమించారు. ఏవైనా వివరాలు కావాలని అడిగితే మాకు తెలియదు. చెబితే మా ఉద్యోగాలు పోతాయి. ఇప్పటికే ఎంతో మందిని తొలగించారని భయంతో వివరాలు చెప్పేందుకు ముందుకు రావడం లేదు. మా దగ్గరికి ఎవరు వచ్చినా సీసీ కెమెరాల్లో అప్పుడే తెలిసిపోతుందని సిబ్బంది చెప్పారు.



టోల్‌గేట్ సమీపంలో నిలిచిన వాహనాలు

స్థానికులకూ టోల్..

జిన్నారం(పటాన్‌చెరు): హైదరాబాద్ – మెదక్ జాతీయ రహదారిపై 2022లో టోల్‌గేట్‌ను ఏర్పాటు చేశారు. 765డి జాతీయ రహదారి బాలానగర్ నుంచి షాపూర్ నగర్, అన్నారం, దోమడుగు, బొంతపల్లి, గుమ్మడిదల గ్రామాలను కలుపుతూ మెదక్ వరకు విస్తరించారు. గుమ్మడిదలలోని మల్లన్నదేవాలయం సమీపంలో టోల్ గేట్‌ను ఏర్పాటు చేశారు. ప్రతినిత్యం ఈ టోల్ గేట్ నుంచి సుమారు మూడువేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ప్రస్తుతం టోల్ గేట్ వద్ద కంప్యూటర్లను వినియోగిస్తున్నారు. బుధవారం జరిపిన విజిట్‌లో కంప్యూటర్‌కు సంబంధించి ఎలాంటి ఇబ్బందులు కనబడలేదు. స్థానికంగా ఉన్న వాహనాలకు కూడా టోల్ వసూలు చేస్తుండటంతో పలువురు వాహనదారులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. టోల్ వసూలు ఎప్పటివరకు అనే విషయాన్ని, ఎన్ని డబ్బులు కలెక్షన్ అవుతాయనే తదితర విషయాలను నిర్వాహకులు చెప్పేందుకు ముందుకు రాలేదు. నేషనల్ హైవేస్‌కు సంబంధించిన వారి నుంచి అనుమతులు ఇస్తేనే సమాచారం ఇస్తామని చెప్పటం గమనార్హం.

బీజేపీ అసమర్థ పాలనను తరిమికొట్టాలి

జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు



జహీరాబాద్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ అసమర్థ పాలనతో సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మాణిక్‌రావు ఆరోపించారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్థాంతరంగా వంట గ్యాస్ సిలిండర్ల ధరలు పెంచడం సామాన్యుడి నడ్డి విరచడమేనని విమర్శించారు. మరోమారు కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే మహిళా దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ మహిళలకు ఇచ్చిన కానుక అని ఎద్దేవా చేశారు. అంతే కాకుండా నిత్యావసర ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉజ్వల పథకం కింద ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతులమీదుగా లబ్ధి పొందిన మొట్టమొదటి మహిళ సైతం నేడు సిలిండర్ కొనలేక కట్టెల పొయ్యిపై వంట చేస్తోందన్నారు. రాబోయే ఎన్నికల్లో బీజేపీని తరిమికొట్టాలన్నారు.

సామాన్యుల నడ్డి విరుస్తున్న కేంద్రం

అందోలు ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్



జోగిపేట(అందోల్): వంట గ్యాస్‌పై రూ.50 పెంచి మరోసారి కేంద్ర ప్రభుత్వం సామాన్యుల నడ్డి విరిచిందని అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆరోపించారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. దేశ ప్రజలు చాలీచాలని జీతాలతో కుటుంబాన్ని నెట్టుకువస్తుంటే వంట గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడంతో కుటుంబ పోషణ మరింత భారంగా మారిందన్నారు. నిత్యావసరం అయిన వంట గ్యాస్ ధర పెంచడం సరైన చర్య కాదన్నారు. రూ.460 ఉన్న గ్యాస్ సిలిండర్ ధరను నేడు రూ.1,160కి తీసుకొచ్చారన్నారు. మార్చి 8వ తేదీన మహిళా దినోత్సవానికి మోదీ ఇచ్చే కానుక అని ఎద్దేవా చేశారు.

వంట గ్యాస్ ధర పెంపు అన్యాయం

నర్సాపూర్: కేంద్ర ప్రభుత్వం వంట గ్యాస్ ధరను పెంచడం అన్యాయమని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వంట గ్యాస్ ధర పెంపును నిరసిస్తూ మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు ఈనెల 3వ తేదీన అన్ని మండల కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. పెరిగిన గ్యాస్ ధరతో పేదలపై భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆత్మ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, శివ్వంపేట ప్యాక్స్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

ఘనంగా పద్మనాభ స్వామి బ్రహ్మోత్సవాలు



కల్యాణ మహోత్సవంలో భక్తులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని వెలిమెలలో శ్రీలక్ష్మీ అనంత పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలను బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కౌన్సిలర్‌లు సుచరిత కొమరయ్య, పటోళ్ల రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం హర్షనీయమన్నారు. స్వామి దయతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సోమిరెడ్డి, కార్పొరేటర్లు మెట్టు కుమార్‌యాదవ్, పుష్ప, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, వైస్ చైర్మన్ మల్లారెడ్డి, తెల్లాపూర్ సొసైటీ చైర్మన్ మల్లెపల్లి బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

కుక్కలకు టీకాలు వేయిస్తున్నాం

- గ్రామ సింహాల బెడద లేకుండా చూస్తాం
- సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం
- తెల్లాపూర్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్
- 'సాక్షి ఫోన్ ఇన్'కు సమస్యల వెల్లువ



ఫోన్ ద్వారా ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న కమిషనర్ శ్రీనివాస్



తెల్లాపూర్‌లో అధ్వానంగా రోడ్డు

సాక్షి ఫోన్ ఇన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సాక్షి బుధవారం ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహించింది. బల్దియా ప్రజలు ఫోన్ ద్వారా తమ సమస్యలను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ దృష్టికి తీసుకువచ్చారు. కుక్కల బెడదతో పాటు తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలపై పలువురు అడిగిన ప్రశ్నల్లో కొన్నింటికి కమిషనర్ అక్కడే పరిష్కారం చూపారు. మరి కొన్నింటిని త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వీధికుక్కల నుంచి మున్సిపల్ పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని, వాటికి టీకాలు వేయిస్తున్నామని తెలిపారు.

చెరువులో మురుగునీరు చేరుతోంది. చేపలు మృతి చెందుతున్నాయి. నలగండ్ల నుంచి పెద్దఎత్తున మురుగునీరు చెరువులోకి వస్తోంది. సమస్యను పరిష్కరించండి.

– రవీందర్‌రెడ్డి, తెల్లాపూర్

కమిషనర్: చెరువులోకి నీరు వచ్చే ప్రాంతం వద్ద మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. ఈ ప్రక్రియను రెండు నెలల్లో ముగించేలా ప్రణాళికలు చేపట్టాం.

తెల్లాపూర్‌లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. ఎటు వెళ్లాలన్నా భయపడాల్సి వస్తోంది. చర్యలు తీసుకోండి. – కృష్ణ, నర్సింహా, తెల్లాపూర్

కమిషనర్: కుక్కలకు సంబంధించి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని చేపట్టాం. త్వరలోనే వీధి కుక్కల బెడద నుంచి విముక్తి కల్పిస్తాం.

తెల్లాపూర్ పరిధిలోని మైఫేర్ వద్ద రోడ్డును అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకోండి.

– రమణ, తెల్లాపూర్

కమిషనర్: రోడ్డు అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేశాం. త్వరలో ఇందుకు సంబంధించిన పనులను ప్రారంభిస్తాం.

ఉస్మాన్‌నగర్ నుంచి గోపన్‌పల్లికి వెళ్లేరోడ్డు అధ్వానంగా తయారైంది. లైట్లు కూడా లేకపోవటంతో రాత్రి సమయంలో ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– చాణక్య, ఉస్మాన్‌నగర్

కమిషనర్: ఈ రోడ్డును పరిష్కరించేందుకు వచ్చే కౌన్సిల్ సమావేశంలో నిధులు కేటాయించేలా చర్యలు చేపడుతాం. వీధి లైట్లు ఏర్పాటు చేసేలా చూస్తాం.

కాలనీల్లో రోడ్లపైనే చెత్త వేసి కాల్చివేస్తున్నారు. తాగునీటికి సంబంధించి బిల్లు సమస్య కూడా ఉంది.

– శ్రీనివాస్, విద్యుత్‌నగర్ కాలనీ

కమిషనర్: 3/4 నీటి కనెక్షన్ ఉంటే బిల్లులు ఎక్కువగా వస్తాయి. దీన్ని 1/2గా మార్చుకుంటే తక్కువ బిల్లు వచ్చే అవకాశాలు ఉంటాయి. చెత్తను రోడ్డుపై తగలపెట్టవద్దని సిబ్బందికి ఆదేశాలు ఇస్తాం. కాలనీవాసులు కూడా చెత్తను రోడ్లపై వేయకుండా చెత్త సేకరణ వాహనాల్లో చెత్తను వేసి సహకరించాలి.

నలగండ్ల నుంచి మురుగునీరు వస్తుంది. మా పరిసర ప్రాంతాల్లో నీరు నిలవడంతో దోమల సమస్య ఉంది. సమస్యను పరిష్కరించండి.

– జగదీశ్, తెల్లాపూర్

కమిషనర్: దోమల నివారకు చర్యలు తీసుకుంటున్నాం. మురుగునీరు బయటకు రాకుండా ఏర్పాట్లు చేస్తాం.

డ్రీమ్ వ్యాలీలోని ప్లాట్లు కబ్జాకు గురవుతున్నాయి. ఈ విషవయమై చర్యలు తీసుకోండి.

– శ్రీనివాస్‌రెడ్డి, తెల్లాపూర్

కమిషనర్: ఈ విషయమై తమకు లిఖిత పూర్వక వినతిపత్రాన్ని అందించండి. తహసీల్దార్‌కు విషయాన్ని తెలిపి సమస్యను పరిష్కరించేలా చూస్తాం.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోండి. మంజీరా నీటిని సరఫరా చేయండి.

– శ్రీరాజు, బోన్‌సాయి అపార్ట్‌మెంట్

కమిషనర్: డ్రైనేజీ సమస్యను పరిష్కరించేలా నిధులు కేటాయిస్తాం. తాగునీటి సమస్య పరిష్కారానికి నాగులపల్లి, ఉస్మాన్‌నగర్‌లో నీటి ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నాం.

కాలనీలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది.

– శ్రీధర్, విద్యుత్‌నగర్

కమిషనర్: కుక్కల బెడదను పరిష్కరించేందుకు రెండు రోజుల క్రితం వాటిని తీసుకెళ్లి టీకాలు వేయించాం.

క్లుప్తంగా

ఒగ్గు పూజారిపై దాడిచేసిన నిందితుల అరెస్ట్

దుబ్బాకరూరల్: మండలంలోని కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన ఒగ్గు పూజారి పయ్యావుల దేవయ్య(48)పై దాడి చేసిన నిందితులు పరారయ్యారు. బుధవారం వారిని పట్టుకున్నట్లు ఎస్‌ఐ మహేందర్ తెలిపారు. నిందితులు గంగరాజు(27), బాలమల్లు(45), వెంకటేశ్(37), నరేష్(32), రాజయ్య(43)పై హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వరకట్న వేధింపుల కేసులో జైలు

కంగ్టి(నారాయణఖేడ్): వరకట్న వేధింపుల కేసులో నిందితుడికి కోర్టు జైలుశిక్ష, జరిమాన విధించింది. బుధవారం కంగ్టి ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సిద్ధంగిర్గా గ్రామానికి చెందిన జైపాల్ తన భార్య రత్నమ్మను అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురిచేస్తున్నాడు. పోలీసులకు ఆమె ఫిర్యాదు చేయడంతో జైపాల్‌పై వరకట్న వేధింపుల కేసు అప్పటి ఎస్‌ఐ నానునాయక్ నమోదు చేశారు. వాదనలు విన్న అనంతరం నిందితుడిపై నేరం రుజువైనందున నారాయణఖేడ్ జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి ఎస్.ప్రియాంక మూడు నెలల జైలు శిక్ష, రూ.2 వేల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో జైలు శిక్ష మరో నెల పొడిగించాలని జడ్జి తీర్పు చెప్పినట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం


శివలీల

నారాయణఖేడ్: మండలంలో ఓ యువతి అదృశ్యమైంది. బుధవారం ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పైడిపల్లి గ్రామానికి చెందిన లొటింగుల శివలీల (23) ఇంటర్మీడియెట్ పూర్తిచేసి ఇంటివద్దే ఉంటోంది. ఫిబ్రవరి 22వ తేదీ రాత్రి తల్లి కమలమ్మతో కలిసి భోజనం చేసి ఇంట్లో నిద్రించింది. అర్ధరాత్రి తల్లి లేచి చూస్తే కూతురు కన్పించలేదు. చుట్టుపక్కల వారిని, బంధువులు, తెలిసిన వారిని విచారించినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి కమలమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

కేబుల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం


పరిశ్రమ నుంచి పొగలు వస్తున్న దృశ్యం

మనోహరాబాద్(తూప్రాన్): షార్ట్ సర్క్యూట్‌తో కేబుల్ పరిశ్రమలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ సంఘటన మనోహరాబాద్ మండలంలోని కూచారం శివారులో బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కూచారం గ్రామ శివారులో వ్యాలీ ప్రోడక్ట్ పరిశ్రమ(కేబుల్)లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించింది. దట్టమైన నల్లటి పొగలు ఆ ప్రాంతమంతా వ్యాపించాయి. రామాయంపేట నుంచి అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో భారీ నష్టం వాటిల్లినట్లు పరిశ్రమ యజమాన్యం తెలిపింది. పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

యాంటీ ర్యాగింగ్‌పై వైద్య విద్యార్థులకు అవగాహన

సిద్దిపేటకమాన్: ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని సిద్దిపేట త్రీ టౌన్ సీఐ భానుప్రకాశ్ వైద్య విద్యార్థులకు సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ మెడికల్ కళాశాల వైద్యవిద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాలలో సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను ర్యాగింగ్ చేయొద్దన్నారు. వైద్య వృత్తి ఎంతో విలువైందన్నారు. వైద్యులుగా సమాజానికి సేవ చేయాలని కోరారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల వైద్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అపరిచితుల ఫోన్ కాల్స్‌కు స్పందించొద్దు

సైబర్ నేరాలు-తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన


సిద్దిపేటలో సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న వన్‌టౌన్ సీఐ భిక్షపతి

సిద్దిపేటకమాన్: సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట వన్‌టౌన్ సీఐ భిక్షపతి అన్నారు. సిద్దిపేట వన్ టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని నాసర్‌పూర కాలనీ ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళల భద్రత, సీసీ కెమెరాల ప్రాధాన్యత, మహిళా చట్టాలు, వరకట్న వేధింపులు తదితర అంశాలపై బుధవారం రాత్రి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పనిచేసే ప్రదేశాల్లో వేధిస్తే మహిళలు డయల్ 100 లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. సైబర్ మోసాలపై జాతీయ హెల్ప్‌లైన్ నంబర్ 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌ఐ నరసింహరావు, సిద్దిపేట మున్సిపల్ వైస్‌చైర్మన్ కనకరాజు, కౌన్సిలర్ బందారం రాజు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాల్‌కల్(జహీరాబాద్): అపరిచితులు చేసే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హద్నూర్ ఎస్‌ఐ వినయ్‌కుమార్ అన్నారు. మండల పరిధిలోని చాల్కి జెడ్పీహెచ్‌ఎస్‌లో బుధవారం సైబర్ నేరాలు–తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ సైబర్ నేరగాళ్లు మోసపూరితమైన కాల్స్, మెస్సెజ్‌లు పంపి ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండటమే కాకుండా ఇతరులకు అవగాహన కల్పించాలన్నారు. పిల్లలు చెబితే తల్లిదండ్రులు వింటారని, వారికి తప్పనిసరిగా అవగాహన


చాల్కిలో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వినయ్‌కుమార్


ర్యాలీ నిర్వహిస్తున్న జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు

కల్పించాలన్నారు. ముఖ్యంగా బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, బ్యాంక్ ఖాతా వివరాలను చెప్పాలని సైబర్ నేరగాళ్లు అడుతారేతప్ప బ్యాంక్ సిబ్బంది అలాంటి వివరాలు అడగరని చెప్పారు. అపరిచితులు ఫోన్ చేస్తే వ్యక్తి గత సమాచారంను చెప్పొద్దన్నారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్ల నిండిన తర్వాత డ్రైవింగ్ లైసెన్స్ తీసుకొని వాహనాలు నడపాలని సూచించారు.

మద్యం తాగి వాహనాలు నడిపితే జైలుకు పంపడమే కాకుండా జరిమానా కూడా విధించడం జరుగుతుందన్నారు. ఈ విషయాన్ని కుటుంబ సభ్యులు, ఇతరులకు తెలియజేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రాజు, హెచ్‌ఎం మీనా కుమారి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాశ్‌గౌడ్ అన్నారు. బుధవారం చిన్నశంకరంపేట ప్రభుత్వ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ వ్యక్తిగత బ్యాంకు వివరాలను అపరిచితులు అడిగితే చెప్పొద్దన్నారు. మొబైల్ ఫోన్‌కు వచ్చే లింక్‌లు క్లిక్ చేయొద్దని హెచ్చరించారు. సైబర్ నేరం జరిగితే వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నాగేందర్, ఏఎస్‌ఐ లక్ష్మణ్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన ర్యాలీ

నర్సాపూర్‌రూరల్: మండలంలోని జక్కపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు బుధవారం సైబర్ మోసాలు, నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాల నుంచి కొడిపల్లి మండలం తునికి నల్ల పోచమ్మ ఆలయం వరకు ప్లకార్డ్స్ పట్టుకొని ర్యాలీ తీశారు. తునికి నల్ల పోచమ్మ ఆలయం ఆవరణలో సైబర్ మోసాలు, నాటిక, పాటల రూపంలో సైబర్ మోసాలు వివరించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు రామారావు, ప్రతిభ, ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురికి గాయాలు


గాయపడ్డ సురేశ్


గాయపడ్డ దుర్గాప్రసాద్

రామాయంపేట(మెదక్): మండలంలోని అక్కన్నపేట గ్రామశివారులో రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఇద్దరు యువకులు గాయపడ్డారు. బుధవారం కాట్రియాల గ్రామానికి చెందిన మైలారం సురేశ్ బైక్‌పై స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఇదే క్రమంలో హవేలిఘనపూర్ మండలం రాజ్‌పేటకు చెందిన దుర్గాప్రసాద్ బైక్‌పై రామాయంపేట వస్తున్నాడు. వారిద్దరి బైక్‌లు ఎదురెదురుగా ఢీ కొనడంతో ఇద్దరూ గాయపడ్డారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సిద్దిపేటకమాన్: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. ఈ సంఘటన సిద్దిపేట పట్టణ శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు, 108 సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఎల్లయ్య (42) బైక్‌పై పట్టణ శివారు నాగదేవత టెంపుల్ నుంచి సిరిసిల్ల బైపాస్‌లో వెళ్తున్నాడు. ఈ క్రమంలో మార్గంమధ్యలో టిప్పర్ ఢీకొనడంతో ఎల్లయ్య గాయపడ్డాడు. 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

మహిళలు నిర్భయంగా ముందుకు రావాలి

ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని


షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ: మహిళలు మౌనం వీడి, నిర్భయంగా ముందుకు రావాలని, వేధింపుల నుంచి బయటపడాలని ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో మెదక్ షీ టీమ్స్ ఫిబ్రవరిలో ఇప్పటి వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమాల గురించి వివరించారు. ఎనిమిది మందికి ఈవ్ టీజర్స్‌కు కౌన్సెలింగ్, మూడు పెట్టీ కేసులు, రెండు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశామన్నారు. వేధింపులకు గురయ్యే మహిళలు షీ టీంకు ఫిర్యాదు చేస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు ఫోన్‌చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని సూచించారు. ఎవరైన వేధిస్తే వెంటనే 100 లేదా షీటీమ్ వాట్సప్ నంబర్ 6303923823, పోలీస్ కంట్రోల్ రూమ్ నంబర్ 08452–223533 కు ఫోన్ చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. చదువుకునే విద్యార్థినులకు 18 ఏళ్లు నిండకుండానే వివాహం చేస్తున్నట్లు తెలిస్తే వెంటనే 1098 కు తెలియజేయాలన్నారు.

ప్రజ్ఞాపూర్ కళాకారుడికి డాక్టరేట్


గోవాలో డాక్టరేట్ అందుకుంటున్న ప్రవీణ్

గజ్వేల్‌రూరల్: ప్రజ్ఞాపూర్‌కు చెందిన కళాకారుడు పూదరి ప్రవీణ్‌కు డాక్టరేట్ లభించింది. చిన్నతనం నుంచే పాటలపై మక్కువతో పాఠశాల స్థాయి నుంచే మంచి గుర్తింపును సాధించాడు. సిద్దులు, వెన్నెల కళాబృందంలో సభ్యుడిగా ఉన్న ప్రవీణ్ తనదైన శైలిలో కాళ్లకు గజ్జె కట్టి తెలంగాణ ఉద్యమ, జానపద పాటలను పాడుతూ అందరిచే మన్ననలు పొందాడు. ఇటీవల గోవాలో జరిగిన కార్యక్రమంలో కన్న తల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రవీణ్‌కు డాక్టరేట్ అందజేశారు. బుధవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తనకు డాక్టరేట్ రావడం సంతోషంగా ఉందన్నారు. గోవా స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వాహకులు సెల్వార్, అతిథులు యాసిప్ కరీనక్రప్, కన్నతల్లి ఫౌండేషన్ చైర్మన్ రాజన్‌బాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్‌ముక్క గొంతులో ఇరుక్కొని మహిళ మృతి


సంతోషి మృతదేహం

వెల్దుర్తి(తూప్రాన్): చికెన్ ముక్క గొంతులో ఇరుక్కొని మహిళ మృతి చెందింది. ఈ ఘటన మెదక్ జిల్లా మాసాయిపేట మండలం కొప్పులపల్లి గ్రామశివారులో చోటుచేసుకుంది. ఎస్‌ఐ మధుసూదన్‌గౌడ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒడిశా రాష్ట్రానికి చెందిన సంతోషి (24), అంగోరి మాజీ అక్కాచెల్లెళ్లు. వీరిద్దరూ తమ బంధువులతో కలిసి కొప్పులపల్లి గ్రామశివారులోని ఓ ఇటుకబట్టీలో పనిచేస్తున్నారు. మంగళవారం తూప్రాన్ సంతకు వెళ్లి కూరగాయలతో పాటు చికెన్ తెచ్చారు. రాత్రి 11 గంటల సమయంలో భోజనం చేస్తుండగా సంతోషి గొంతులో చికెన్‌ముక్క ఇరుక్కుంది. బయటకు వచ్చి కేకలు వేయబోతూ ఒక్కసారిగా కుప్పకూలింది. గమనించిన తోటి కార్మికులు విషయాన్ని ఇటుక బట్టీ యజమాని దృష్టికి తీసుకెళ్లి తూప్రాన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్టు డాక్టర్లు నిర్ధారించారు. పొట్టకూటి కోసం వలసవచ్చి ప్రాణాలు కోల్పోయిన సంతోషి మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించేందుకు ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. అవివాహిత కావడంతో కుటుంబసభ్యులు తూప్రాన్‌లోనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఖారీజ్‌ఖాతా అక్రమ రిజిస్ట్రేషన్‌పై ఆందోళన


కొండాపూర్‌లో నిరహారదీక్ష చేస్తున్న గ్రామస్తులు

మనోహరాబాద్(తూప్రాన్): తాతల కాలంనాటి నుంచి కబ్జాలో ఉన్న ఖారీజ్‌ఖాతా భూమిని రికార్డు పేరుతో తహసీల్దార్ అక్రమ రిజిష్టర్ చేశారని కొండాపూర్ గ్రామస్తులు బుధవారం ఒక రోజు నిరహారదీక్ష చేపట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ నివాస గృహాలకు ఆనుకుని ఉన్న సర్వే నంబర్ 144లో 11ఎకరాల 37 గుంటలు ఉన్నదన్నారు. ఈ భూమిలో తాతల కాలంనాటి నుంచి గ్రామస్తులే కబ్జాలో ఉన్నారు. ఈ భూమి ఖారీజ్‌ఖాతా కావడంతో ఇప్పటి వరకు ఎవ్వరూ రాలేదన్నారు. కాగా రెండు నెలల క్రితం ఈ భూమిని అసలు పట్టదారులతో వేరేవారికి అక్రమ రిజిష్టర్ చేశారని గ్రామస్తులు ఆరోపించారు. తమకు న్యాయం జరగాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తిచేస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ భిక్షపతిని వివరణ కోరగా రికార్డు ప్రకారమే పట్టదారు భూమి ధరణిలో ఉన్నందున రిజిష్టర్ చేసినట్లు తెలిపారు. గ్రామస్తులు ఎందుకు నిరహారదీక్ష చేస్తున్నారో తెలియదన్నారు.

రంగనాయక సాగర్ అద్భుతం

పంజాబ్ వ్యవసాయ శాఖ అధికారుల బృందం


రంగనాయక సాగర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): చిన్నకోడూరు మండలం చంద్లాపూర్ శివారులోని రంగనాయక సాగర్ రిజర్వాయర్‌ను బుధవారం పంజాబ్ రాష్ట్రానికి చెందిన వ్యవసాయ శాఖ అధికారుల బృందం సందర్శించింది. రిజర్వాయర్, పంప్‌హౌస్, బండ్‌ను పరిశీలించారు. రంగనాయక సాగర్ రిజర్వాయర్ నిర్మాణం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు. రిజర్వాయర్ ద్వారా రెండు పంటలు పండుతాయని, ఈ ప్రాంతం పచ్చని పంట పొలాలతో సస్యశ్యామలంగా మారుతుందన్నారు. రిజర్వాయర్ నిర్మాణం, సాగు తదితర అంశాలను ఈఎన్‌సీ హరిరామ్ బృందానికి వివరించారు. కార్యక్రమంలో కాళేశ్వరం ఎస్‌ఈ బస్వరాజ్, ఈఈ గోపాలకృష్ణ, ఏఈ ఖాజా ఉన్నారు.

చోరీ కేసులో నలుగురికి జైలు

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో జరిగిన రెండు చోరీ కేసుల్లో నలుగురికి కోర్టు జైలు శిక్ష విధించినట్లు గజ్వేల్ పోలీసులు తెలిపారు. బుధవారం వారు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రజ్ఞాపూర్‌లో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో చోరీ జరగడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన గుండ్ర రాములు, నర్సిరాజును అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. నేరం రుజువు కావడంతో నిందితులిద్దరికి ఆరు నెలల కఠిన కారాగార శిక్ష విధించారు. అదే విధంగా రెండో కేసు పిడిచెడ్ రోడ్డు మార్గంలో ఓ వైన్స్ ముందున్న స్కూటీని ఎత్తుకెళ్లారు. అందులోని రూ.3.50 లక్షల విలువైన బంగారు నగలు చోరీ చేసినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ కేసులో జైలు నుంచి విడుదలైన మహ్మద్ షరీఫ్, ఇతడికి సహకరించిన షాదుల్లాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచారు. నేరం రుజువు కావడంతో మహ్మద్ షరీఫ్‌కు ఏడాది జైలు, షాదుల్లాకు మూడు నెలల జైలు శిక్ష ప్రిన్సిపల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ సౌమ్య విధించారు.

చోరీ నిందితుడి అరెస్ట్


చోరీ వివరాలు వెల్లడిస్తున్న సీఐ కృష్ణ

దుబ్బాకటౌన్: దుబ్బాకలోని 19వ వార్డు కౌన్సిలర్ ఎంగారి స్వప్న రాజిరెడ్డి ఇంట్లో ఫిబ్రవరి 27వ తేదీన దొంగతనానికి పాల్పడిని నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం సీఐ మున్నూరు కృష్ణ చోరీ కేసు వివరాలు వెల్లడించారు. సిద్దిపేటలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన జంగోని సాయికుమార్(24) దొంగతనాలు చేస్తున్నాడు. దొంగతనం కేసులో పోలీసులకు పట్టుబడి ఫిబ్రవరి 15న బెయిల్‌పై విడుదలయ్యాడు. మళ్లీ ఫిబ్రవరి 27న ఇంటికి తాళం వేసి దుబ్బాక 19వ వార్డు కౌన్సిలర్ ఎంగారి స్వప్న రాజిరెడ్డి బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదనుగా భావించి ఇంటి తాళాలు పగులగొట్టి బంగారం, వెండి వస్తువులు సాయికుమార్ ఎత్తుకెళ్లాడు. ఇతడు ఆరు చోరీ కేసుల్లో నిందితుడని తెలిపారు. అతడి నుంచి ఐదు తులాల బంగారం, రెండు కిలోల వెండిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐ మహేందర్, ఐడీ పార్టీ కానిస్టేబుల్ రాంజీని సీఐ ప్రత్యేకంగా అభినందించారు.

వ్యక్తి ఆత్మహత్య

కొల్చారం(నర్సాపూర్): అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో తీవ్ర మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన బుధవారం ఉదయం వెలుగులోకి వచ్చింది. కొల్చారం ఎస్‌ఐ శ్రీనివాస్ గౌడ్, మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ముదుతలు మంగలి యాదగిరి (45) తరచూ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడం, మరోవైపు ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో కొంతకాలంగా తీవ్ర మానసిక ఒత్తికి లోనయ్యాడు. మంగళవారం రాత్రి భోజనం చేసి బయటకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి తిరిగిరాలేదు. అదే రోజు రాత్రి 11.30 గంటల సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న పోలీసులకు ప్రధాన రహదారి పక్కనున్న చెట్టుకు ఉరి వేసుకున్న వ్యక్తి కనిపించాడు. దీంతో గ్రామస్తులకు సమాచారం అందించడంతో అక్కడి చేరుకున్న వారు యాదగిరిగా గుర్తించారు. మృతుడికి భార్య శేకమ్మ, వివాహమైన కూతురు, కుమారుడు సాయి కృష్ణ ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పల్లెలు బాగుంటేనే దేశాభివృద్ధి

జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ


యాదవ సంఘం భవన నిర్మాణ శంకుస్థాపనలో జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): పల్లెలు బాగుంటేనే దేశం అభివృద్ధి చెందుతుందని, తెలంగాణ ప్రభుత్వం పల్లెల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కిష్టాపూర్‌లో యాదవ సంఘం, వడ్డెర సంఘం భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అలాగే గోనెపల్లిలో కంటి వెలుగు శిబిరం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పల్లెల అభివృద్ధికి సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. అంధత్వ నివారణ కోసం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మాణిక్యరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు కనకరాజు, సదానందం గౌడ్, రైతుబంధు జిల్లా డైరెక్టర్ వెంకటేశం, మార్కెట్ కమిటీ చైర్మన్ వనిత రవీందర్‌రెడ్డి, సర్పంచ్‌లు స్వరూప ఎల్లాగౌడ్, కవిత, ఎంపీటీసీ పద్మ మల్లేశం గౌడ్, లచ్చయ్య, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాల్‌కల్ ఎంపీటీసీ మృతి


సంగమ్మ (ఫైల్)

న్యాల్‌కల్(జహీరాబాద్): న్యాల్‌కల్ ఎంపీటీసీ సభ్యురాలు పడకంటి సంగమ్మ(86) బుధవారం తెల్లవారు జామున మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగమ్మ మంగళవారం రాత్రి భోజనం చేసి ఇంటిలో నిద్రించింది. రోజూ 7 గంటలకే నిద్రలేచేది. బుధవారం ఉదయం 8 అవుతున్న బయటకు రాకపోవడంతో పక్కనే ఉన్న బంధువులు తలుపు తట్టి పిలిచినా ఎలాంటి స్పందన రాలేదు. దీంతో లోపల గడియను తొలగించి తలుపులను తీసి చూడగా సంగమ్మ విగత జీవిగా కనిపించింది. తెల్లవారు జామున గుండెపోటు రావడం వల్లే సంగమ్మ మృతి చెంది ఉండవచ్చని బంధువులు తెలిపారు. ఆమె అంత్యక్రియలు న్యాల్‌కల్‌లో నిర్వహించారు. అంత్యక్రియలకు ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ఈదుపల్లి శివకుమార్, న్యాల్‌కల్ జెడ్పీటీసీ స్వప్న భాస్కర్, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ తదితరులు హాజరై సంతాపం తెలిపారు.

సీఎంకు వినతి

నస్రుల్లాబాద్(బీర్కూర్): కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలంలోని తెలంగాణ తిరుమల దేవస్థానానికి సీఎం కేసీఆర్ వచ్చిన సందర్భంగా సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తడ్కల్ సర్పంచ్ గడ్డం మనోహర్ సీఎంను కలిసి తడ్కల్‌ను మండల కేంద్రంగా ప్రకటించాలని వినతిపత్రం ఇచ్చారు. అంతకుముందు వినతిపత్రాన్ని శ్రీవారి పాదాల వద్ద ఉంచారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా అందోల్ సభలో తడ్కల్‌ను మండల కేంద్రంగా చేస్తానన్న హామీని నిలబెట్టుకోవాలని ప్రార్థించినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


కార్లోసన్ మృతదేహం

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన బుధవారం చోటుచేసుకుంది. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా రామగుండం మండల కేంద్రానికి చెందిన కార్లోసన్ సికింద్రాబాద్‌లోని మల్కాజ్‌గిరిలో ఉంటున్న బావ పులి కిరణ్‌కుమార్ ఇంటికి వచ్చాడు. బుధవారం స్వగ్రామం రామగుండం గ్రామానికి తండ్రి డేని విన్సెంట్, బావ పులికిరణకుమార్‌తో రెండు బైక్‌లపై బయలుదేరారు. ఒక బైక్‌పై తండ్రి, బావ, మరో బైక్‌పై మృతుడు కార్లోసన్ వెళ్తున్నారు. ఈ క్రమంలో కొండపాక గ్రామ శివారులో కార్లోసన్ బైక్ అదుపు తప్పి రోడ్డుపక్కనున్న చెట్టును ఢీకొంది. తలకు బలమైన గాయాలవడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.కళ్లేదుటే కొడుకు మృతి చెందడంతో తండ్రి, బావ రోదన చూపరులను కంటతడి పెట్టించాయి. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రతి గ్రామానికి ఫీల్డ్ అసిస్టెంట్‌ను నియమించాలి

డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్

దుబ్బాక: మండలంలోని ప్రతీ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లను నియమించాలని డీబీఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం రాయపోల్ మండలం రామ్‌సాగర్, ఉదయ్‌పూర్, సయ్యద్ నగర్ గ్రామాలలో పర్యటించారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో ఫీల్డ్ అసిస్టెంట్లు లేకపోవడంతో కూలీలకు సరిపడా పనిదొరకడం లేదన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు లేని గ్రామాలలో వారిని తప్పకుండా నియమించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రామ్‌సాగర్‌లో 25 డబుల్ బెడ్రూంలు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా వాటిని ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. ఆయన వెంట డీబీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, తదితరులున్నారు.

స్మార్ట్ గా... సైబర్ మోసం

- జాబ్ అవకాశమని అపరిచిత వ్యక్తి మెసేజ్
- రెట్టింపు నగదు అంటూ ఆశ
- రూ.11,83,000 లక్షలు పోగొట్టుకున్న బాధితుడు

పటాన్‌చెరు టౌన్: జాబ్ ఆఫర్ అంటూ అపరిచితుడి నుంచి వచ్చిన వాట్సాప్ మెసేజ్ కు స్పందించి వ్యక్తి భారీ మొత్తంలో డబ్బు పోగొట్టుకున్నాడు. ఈ ఘటన భానూర్ బీడీఎల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. భానూర్ – బీడీఎల్ పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బాపట్ల జిల్లా చీరాల టౌన్ కు చెందిన తిరుమలశెట్టి వేణుమాధవ్ కుటుంబంతో కలిసి ఐదేళ్ల క్రితం పటాన్‌చెరు మండలం భానూర్ గ్రామం వచ్చాడు. ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో ఫిబ్రవరిలో 21, 22వ తేదీలలో ఆన్ లైన్ లో జాబ్ ఉందంటూ వాట్సాప్ కు మెసేజ్ వచ్చింది. మెసేజ్ ను అనుసరిస్తూ అపరిచితుడు చెప్పినట్టు టెలిగ్రామ్ ద్వారా తన వివరాలను నమోదు చేశాడు. బాధితుడికి ముందుగా యూట్యూబ్ లో లైక్ లు, షేర్లు చేయాలని చెప్పాడు. అతడు చెప్పిన విధంగానే అపరిచితుడి ఖాతాలో రూ.300, తర్వాత రూ.వెయ్యి డిపాజిట్ చేశాడు. దీంతో అతడి ఖాతాలో 1600 వేశాడు. ఇలా రూ.3 వేలు, రూ.5 వేలు, రూ.30 వేలు, రూ.50 వేలు వేస్తూ వచ్చాడు, 23వ తేదీ వరకు వేశాడు. దీంతో అపరిచితుడు అతడి ఖాతా బ్లాక్ అయిందని చెప్పి, ఇంకా నగదు వేస్తే దానికి 10 శాతం అదనంగా ఇస్తానని నమ్మబలికాడు. 24వ తేదీన రూ.7.60 లక్షలు, 25వ తేదీన 3 లక్షలు, 26 తేదీన 20 వేలు ఇలా మొత్తం రూ.11,83,000 లక్షలు వేశాడు. రెట్టింపైన నగదు తన ఖాతాలో వేయమని అడగగా అపరిచితుడు బాధితుడి ఫోన్ నంబర్ బ్లాక్ చేశాడు. తాన మోసపోయినని గ్రహించి జరిగిన విషయాన్ని భానూర్ బీడీఎల్ పీఎస్ లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.